క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

కల్లూరు: రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. మంగళవారం పర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉల్లి పంట సాగుచేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఉల్లి పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాతే కోతలు చేపట్టాలని సూచించారు. పత్తి పంటలో కాయకుళ్లు తెగులుపై నివారణ చర్యల గురించి వివరించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం



దిన్నెదేవరపాడు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. దీంతో కర్నూలు నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మట్టి రోడ్లు చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగించారు. డ్రైనేజీ కాలువలు సక్రమంగా లేకపోవడంతో దిన్నెదేవరపాడు రోడ్డుపై వర్షం నీరు నిలిచింది. ప్రస్తుత వర్షాలతో పత్తి పంటకు తెగుళ్లు సోకే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే గుర్తింపు రద్దు

కోడుమూరు రూరల్: సెలవు రోజుల్లో విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తే పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని గూడూరు ఎంఈఓ సునీలమ్మ హెచ్చరించారు. మగళవారం ఎంఈఓ మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వతేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులను ప్రకటించిందన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ హెచ్చరికలు జారీ చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఎర్రదొడ్డిలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రాముడు ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని ఎర్రదొడ్డి, చిల్లబండ గ్రామాల్లో ఎంపీడీఓ పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంతకుముందు ఆయా గ్రామాల్లోని వీధుల్లో పర్యటించి పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలంతా తమ ఇళ్లలోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ రిక్షాల్లోనే వేయాలని సూచించారు.

తప్పులు లేని జాబితా తయారు చేయండి



మాట్లాడుతున్న రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు

కర్నూలు(రూరల్): తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయం మీటింగ్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బూత్ లెవల్ ఆఫీసర్లు, గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌లెవల్ ఆఫీసర్లు 2002 ఓటరు జాబితాను పరిశీలించి, అందులో ఉన్న ఓటర్లందరూ బతికే ఉన్నారా? లేక మరణించారా? అనే వివరాలు నిర్ధారించుకోవాలన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన దీక్షలు రెండో రోజూ కొనసాగాయి. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లోని శిబిరంలో న్యాయవాదులు వి.కృష్ణమూర్తి, ఎస్.నరసింహ, బి.శ్రీనివాసులు, అయ్యస్వామి, రాము తదితరులు దీక్షలో కూర్చొని శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జోరు వర్షం కురుస్తున్నా న్యాయవాదుల దీక్షలు కొనసాగాయి.

మూగ వేదన!

- మంచాలకట్టలో పశువైద్యం కరువు
- సిబ్బంది లేక మూతపడిన వైద్యశాల
- ఎప్పుడు వస్తారోనని ఎదురుచూపులు చూస్తున్న పాడిరైతులు
- సకాలంలో వైద్యం అందించాలని కోరుతున్న రైతన్నలు



బర్రెకు దెబ్బతిన్న కన్ను



మంచాలకట్టలో పశువైద్య సిబ్బంది కోసం ఎదురు చూస్తున్న పాడిరైతులు

గడివేముల: మండలంలోని మంచాలకట్ట గ్రామంలో మూగ జీవాలకు వైద్యం కరువైంది. గత కొన్ని రోజుల నుంచి పశు వైద్యశాల మూతపడటంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశు వైద్య సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొందని పాడి రైతులు వాపోతున్నారు. పశువులకు ఏ చిన్న రోగం వచ్చినా సచివాలయం, పశు వైద్యశాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉందని పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు. దిక్కు లేని స్థితిలో పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు సొంతంగా వైద్యం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సరైన వైద్యం అందక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. పశు వైద్యశాలలో వైద్యాధికారితోపాటు లైవ్ అసిస్టెంట్, కాంపౌండర్ ఉండాలి.

సిబ్బంది కోసం ఎదురుచూపులు

మంచాలకట్ట మారుమూల గ్రామం కావడంతో ఇక్కడికి ఎవరూ రావడం లేదు. కానీ వైద్యుడు, సిబ్బంది ఆస్పత్రికి వచ్చినట్లు రిజిస్టర్లలో సంతకాలు మాత్రం చేస్తున్నారని, ఆస్పత్రికి వచ్చిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో దాదాపు నాలుగు వేల మంది జనాభా ఉండగా ఎక్కువ శాతం మంది పాడిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. రోజుకు దాదాపు 250 నుంచి 300 లీటర్ల పాలను కేంద్రాలకు పోస్తున్నారు. గ్రామంలో బర్రెలు 500, ఎద్దులు 150 జతలు, 100 ఆవులు, గొర్రెలు 2 వేల వరకు ఉన్నాయి. మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయకపోవడంతో మృత్యువాత పడుతున్నాయి. బర్రెలకు ఎదసూదులు, ఇతర మందుల కోసం గడివేముల, నంద్యాలకు వెళ్లాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మూడు రోజుల కిందట గ్రామానికి చెందిన ఓ పాడి రైతుకు బర్రె కంటి వద్ద దెబ్బతగిలి కన్ను కనబడని పరిస్థితి నెలకొంది. కన్నుకు మాత్రమే ఇంజెక్షన్ వేయాలి కాబట్టి ప్రతి రోజు బర్రెను పశువుల ఆసుపత్రి వద్దకు తీసుకెళ్లి సిబ్బంది ఎవరూ రాకపోవడంతో మళ్లీ ఇంటి తీసుకొస్తున్నామని పాడి రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్య సిబ్బందికి ఫోన్ చేస్తే మంగళవారం వచ్చి ఇంజెక్షన్ వేసి వెళ్లాడని పాడి రైతు చెబుతున్నాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశు వైద్యశాలలో నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మూగజీవాలకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని పాడి రైతులు మొర పెట్టుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



నాకు 5 బర్రెలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా పశు వైద్యశాలను తెరవడం లేదు. పశువులు వ్యాధుల బారిన పడినప్పుడు తెలిసిన వారి ద్వారా వైద్యం చేసుకుని కాపాడుకుంటున్నాం. మూగజీవాలు రోగాల బారిన పడితే మందులు, సలహాలు, సూచనలు ఇవ్వడానికి పశు వైద్యశాలలో ఎవరూ ఉండటం లేదు. పుట్టిన దూడలకు సరైన మందులు వేయకపోవడంతో చనిపోయాయి. వేరే గ్రామానికి పశువులను తీసుకెళ్లి వైద్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి పశు వైద్యశాలలో సిబ్బంది నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– మాబు, పాడిరైతు, మంచాలకట్ట

క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన పెరగాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు సూచించారు. 'స్వస్త్ నారీ–సశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ ఓపీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ.. దేశంలో క్యాన్సర్ కేసులు అధికమవుతున్నాయని, మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ వ్యాధిపై అవగాహనతో ముందుగా వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స తీసుకుంటే నయం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇన్‌చార్జి సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మాధవీశ్యామల తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో..

బి.తాండ్రపాడులోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శిక్షణ కార్యక్రమంలో మంగళవారం నిర్వహించిన జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు శెట్టి పాల్గొని ప్రసంగించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక వైద్యశిబిరాలు అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గంజాయి సాగు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఏఓ మధుమతి

ఓర్వకల్లు: గంజాయి సాగుచేయడం చట్టరీత్యా నేరం అని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వనజకుమారి హెచ్చరించారు. ఆమె మంగళవారం మండలంలోని సోమయాజులపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని ఆర్ఎస్‌కేలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మధుమతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సతీష్‌కుమార్, ఏడీఏ వనజకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వనజకుమారి మాట్లాడుతూ.. రహస్య ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధిత పంటలను ఎవరైనా సాగు చేసినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పత్తి, మొక్కజొన్న పంటలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకునే విధానాలను రైతులకు వివరించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, భూ సాంద్రతను పెంచాలన్నారు. ఏఈఓలు, ఆర్ఎస్‌కేల వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

పీ-4 విధానంపై అవగాహన



సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గడివేముల: మండలంలో పీ–4 (పబ్లిక్–ప్రైవేట్–పీపుల్స్–పార్ట్‌నర్ షిప్) విధానం అమలుకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్తా తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో సచివాలయ సిబ్బందితో పీ–4 అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ–4 విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నదే పీ–4 విధానం ముఖ్య ఆశయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయా గ్రామంలోని ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. వారం రోజుల్లో సర్వేను పూర్తి చేసి నివేదికలను అందజేయాలన్నారు. ఏఎస్ఓ మునిస్వామి, జోనల్ లెవెల్ ట్రైనర్స్ మల్లిక, పుష్పావతి, పాణ్యం సీపీఏపీ టీం మెంబర్లు విజయ, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీ–4 సర్వేపై అవగాహన

కల్లూరు: ప్రభుత్వం పేదరికం తగ్గించడానికి పీ–4 కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీడీఓ నాగేశాచల రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయ ఉద్యోగులకు పీ–4 సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో మార్గదర్శక కుటుంబాలను, బీపీఎల్ కుటుంబాలను సచివాలయ ఉద్యోగులు గుర్తించాలన్నారు.

కుంటలో అడ్డుకట్టను తొలగించాలి



కుంటకు అడ్డంగా వేసిన మట్టికట్టను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామం వద్ద ఉన్న చిన్న మాదన్న కుంటకు నీటి అడ్డంకులను తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్‌తో పాటు, రైతు సంఘం, విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాదన్నకుంటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. పైతట్టు ప్రాంతం నుంచి వర్షపు నీరు రావడంతో చిన్నమాదన్న కుంటలో నీటి నిల్వ ఉండేదని, అలాంటి కుంటకు రిలయన్స్ కంపెనీ వారు దాదాపు 50 మీటర్ల వెడల్పుతో మట్టితో అడ్డుకట్ట వేయడం అన్యాయమన్నారు. ఈ కుంట ఆధారంగా గ్రామంలో 50 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి పంటను సాగు చేసుకునేవారని చెప్పారు. అలాగే గొర్రెలు, పశువులకు నీరు తాపేందుకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. కుంటలోకి నీరు చేరకుండా అడ్డుకట్ట వేయడం వల్ల వర్షాకాలం పూర్తయ్యే సమయానికి రైతులు, పశువుల యజమానులు తీవ్ర ఇబ్బంధులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మట్టి కట్టను తొలగించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్ర, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, సీపీఐ నాయకులు వలి, మధు, వంశీ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్‌లూ.. తూచ్!

- వేసిన వారం రోజులకే ధ్వంసం



గడివేముల-బూజునూరు మధ్య రోడ్డుపై ప్యాచ్‌లు లేచిపోయిన దృశ్యం

గడివేముల: రోడ్ల చక్కదనం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని జనం కూడా ఓ నిర్ణయానికొచ్చేశారు.! కొత్త సంగతి దేవుడెరుగు ముందు గంతలు పూడ్చండని పల్లెల నుంచి పట్నం వాసులు మొత్తుకుంటున్నా కూటమి సర్కారు చెవికెక్కడం లేదు. హడావుడిగా ప్యాచ్ వర్క్‌లతో పాటు కొత్త రోడ్లు వేశారు. వేసి నెల రోజుల దాటకముందే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వాటి స్థానంలో ప్యాచ్ వేశారు. ప్యాచ్ వేసిన వారం రోజులు గడవక ముందే ధ్వంసం కావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని గడివేముల నుంచి బూజునూరు గ్రామం వరకు ఇటీవల రూ.లక్షలు ఖర్చు చేసి కొత్త రోడ్డు నిర్మించారు. రోడ్డు వేసిన కొద్ది రోజులకే అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో అధికారులు స్పందించి ప్యాచ్ వేసి చేతులు దులుపుకున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా ప్యాచ్‌లు వేయగా వారం రోజుల్లోనే చిన్నపాటి వర్షానికే ప్యాచ్‌ల వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తం

కర్నూలు (సెంట్రల్): వాతావరణ శాఖ సూచనల మేరకు వచ్చే నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారు లు రైతులకు ఎప్పటికప్పుడు పంటలు నష్టపోకుండా సూచనలు ఇవ్వాలని, ఎక్కడైనా పంటలు దెబ్బతింటే ఆ వివరాలు తనకు నివేదించాలని ఆదేశించారు. హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాల సమీపంలో ఉండొద్దని ప్రజలకు సూచించారు. అలాగే నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న వాగులు, వంకలు దాటవద్దని సూచించారు.

గాయత్రీదేవిగా దుర్గమ్మ



నిడ్జూరు గ్రామ సమీపంలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ



గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన వెంకాయపల్లె ఎల్లమ్మ

దసరా శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ఆలయాల్లో అమ్మవార్లు రెండోరోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామునుంచే పూజార్లు అమ్మవార్లకు మేల్కొలుపు పూజలు నిర్వహించి పంచామృతాభిషేకం, కలశారాధన, కుంకుమార్చన, ఆకుపూజ, నైవేద్యం, హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్నూలు మండలం నిడ్జూరు, మునగాలపాడు పరిధిలోని తుంగభద్ర నది ఒడ్డున మామిడితోటలో వెలసిన దుర్గమ్మ భక్తులకు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కర్నూలు నగర శివారులో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మను దేవదాయ శాఖ వారు గాయత్రీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

– కర్నూలు(రూరల్)

కోడుమూరులో..



కోడుమూరులో వల్లెలాంబదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: పట్టణంలోని వల్లెలాంబదేవి, కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాతా, రాములమ్మ, తులజా భవాని, అంబాభవాని ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి, బాలత్రిపుర సుందరి దేవి, ధాన్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. వల్లెలాంబదేవి ఆలయంలో పల్లకీ సేవా కార్యక్రమాన్ని భక్తులు కనుల పండువగా నిర్వహించారు. అనంతరం వెంకటగిరి గ్రామ వైఎస్సార్‌సీపీ నేత కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆలయ సన్నిధిలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడూరులో..



గాయత్రీదేవి అలంకరణలో కె.నాగలాపురం సుంకులా పరమేశ్వరీ

గూడూరు మండలంలో దేవీశరన్నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. కె.నాగలాపురం గ్రామంలో వెలసిన సుంకులపరమేశ్వరీ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సి.బెళగల్‌లో అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు చేస్తున్న భక్తులు

సి.బెళగల్: స్థానిక ఈశ్వర, పార్వతి ఆలయాల్లో అమ్మవార్లు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోమట వీధిలో కొలువైన వాసవీ కన్యక పరమేశ్వరి దేవిని కూడా భక్తులు గాయత్రి దేవిగా అలంకరించి పూజలు చేపట్టారు.









అమ్మవారికి గౌరీ దేవి అలంకరణ, కన్యకా పరమేశ్వరి ఆలయంలో..., బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో..., గాయత్రి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

గౌరీ దేవిగా అమ్మవారు

పాణ్యం: దేవి నవరాత్రులు పురస్కరించుకొని మంగళవారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పాణ్యంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు గౌరీ దేవిగా దర్శనమిచ్చారు. అలాగే కన్యాకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని, హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని నిర్వాహకులు గాయత్రి దేవిగా అలంకరించారు. రైల్వే గేటు సమీపంలో వెలసిన కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించినట్లు అర్చకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలత్రిపుర సుందరీ దేవిగా వాసవీ కన్యకా పరమేశ్వరి

గడివేముల: గడివేములలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసర శరన్ననవరాత్రుల్లో భాగంగా రెండో రోజు అర్చకులు వసంత లక్ష్మి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వాతి నక్షత్రం బాలాత్రిపుర సుందరీదేవి అష్టోత్తర శతనామావళి పఠించారు. అనంతరం మహా మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. మనసు, బుద్ధి, చిత్తం ఈ దేవి ఆధీనంలో ఉంటాయని, అభయహస్త ముద్రతో ఉండే ఈ తల్లి అనుగ్రహం కోసం ఉపాసకులు బాలార్చన చేస్తారన్నారు. అమ్మవారిని పలువురు ఆర్యవైశ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్నూలు సాయిబాబా ట్రూప్ వారిచే నిర్వహించిన భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల మధుసూదన గుప్తా, సంఘం నాయకులు శివయ్య తదితరులు ఘనంగా సన్మానించారు.

పంట నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని ఏఓ రవిప్రకాష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వర్కూరు గ్రామంలో పత్తి, ఉల్లి పంటల సాగుపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంట నమోదు ఉంటేనే ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీలు రైతులకు వర్తిస్తాయన్నారు. రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా పత్తి, ఉల్లి పంటలకు తెగుళ్లు సోకే ప్రమాదముందని, రైతులంతా ప్రతిరోజు పంటలను గమనిస్తూ ఉండాలని, ఏవైనా చీడపీడలు సోకినట్‌లైతే వెంటనే మందులను పిచికారీ చేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు.